క్లుప్తంగా

అల్లర్లు సృష్టించే వారిపై కఠిన చర్యలు



దాచేపల్లి: గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బాపట్ల సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్ హెచ్చరించారు. మండలంలోని కేశానుపల్లి గ్రామంలో రాజకీయ పార్టీల నేతలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. డీఎస్పీ జగదీష్ నాయక్ మాట్లాడుతూ కొద్దిరోజుల్లో ఎన్నికల ఫలితాలు రానున్నాయని, గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులకు సహకరించాలని సూచించారు. ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించరాదని, రెచ్చగొట్టేలా మాట్లాడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల నియమ నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా సంబంధిత వ్యక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. సమావేశంలో సీఐ సురేంద్ర బాబు, ఎస్సైలు దాసరి శివనాగరాజు, సంధ్యారాణి తదితరులు ఉన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

సీఐ బాలకృష్ణ



గురజాల : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ టి.బాలకృష్ణ సూచించారు. నగర పంచాయతీలోని పలు వార్డుల్లో మంగళవారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలు సహకరించిన విధంగా ఓట్ల లెక్కింపు రోజు కూడా సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో ఉండాలన్నారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ఉన్నందున ఎవరైనా రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. వార్డుల్లో పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని అల్లర్లకు పాల్పడినా చట్టపరంగా శిక్షించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలన్నారు. ప్రజలు ప్రశాంతమైన జీవనం గడిపేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బి.అనంత కృష్ణ తదితరులున్నారు.

ప్రత్యేక అలంకరణలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వరుడు



పిడుగురాళ్ల: పట్టణంలోని నాగుల గుడి దేవస్థానంలో మంగళవారం సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నాగుల గుడి దేవస్థానంలో బహుళ షష్టి సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ పూజారి, ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

విద్యుదాఘాతంతో ఐదు గేదెలు మృతి

వెల్దుర్తి: విద్యుత్ వైర్లు కిందకు వేళ్లాడుతూ ఎత్తు తక్కువగా ఉండటంతో పొలంలో మేతకు వెళ్లిన గేదెలు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన వెల్దుర్తిలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన సన్నెకంటి కోటయ్య, మండ్లి రాజయ్య, చాగంటి చిన ఏబు, మద్దిగంట రోశయ్య, కన్నెగంటి శ్రీనుల గేదెలు ఉదయాన్నే మేతకు వెళ్లాయి. గంగమ్మకుంట గ్రామ సమీపంలోని పొలంలో విద్యుత్ వైర్లు ఎత్తు తక్కువగా ఉండటంతో ఆ తీగలు గేదెలకు తగలటంతో 5 గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక్కొక్క గేదె విలువ రూ.లక్ష ఉంటుందని గేదెల యజమానులు తెలిపారు. గేదెలు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న యజమానులు హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లారు. గేదెల వలనే తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని, గేదెలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని బాధపడ్డారు. విద్యుత్ శాఖాధికారులు స్పందించి నష్టపరిహారాన్ని అందించాలని కోరారు.

చురుగ్గా రైల్వే అండర్ పాస్ పనులు

- త్వరలో రైల్వే గేటు ఎత్తివేత
- వాహన దారుల నిరీక్షణకు చెక్



61వ నంబర్ గేటు వద్ద రైల్వే అండర్ పాస్ పనులు జరుగుతున్న దృశ్యం

పిడుగురాళ్ల: న్యూ పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ జంక్షన్ పరిధిలో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పట్టణంలోని బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన రైల్వే బ్రిడ్జి సమీపంలో 61వ నంబర్ రైల్వే గేటు ఉంది. ఈ రైల్వే గేటు నుంచి నిత్యం రాకపోకలు జరుగుతూ ఉంటాయి. అయితే ఈ రైల్వే గేటు అవతల జగనన్న కాలనీ, టిడ్కో గృహాలతోపాటు, రైతుల పొలాలు ఉన్నాయి. వీటితోపాటు ఇటీవలే నూతనంగా ప్రైవేటు వెంచర్ కూడా నిర్మిస్తున్నారు. దీంతో ప్రజలు, వాహనాల రాకపోకలు పెరిగాయి. ఈ ప్రాంతంలో అండర్ పాస్ అవసరమని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి రైల్వే శాఖ దృష్టికి తీసుకొని వెళ్లటంతో మంజూరు అయింది. దీంతో రైల్వే అధికారులు తక్షణమే రైల్వే అండర్ పాస్ నిర్మాణ పనులు మొదలు పెట్టారు. సుమారు రూ.40 కోట్లతో నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సుమారు ఏడాదిలో పనులు పూర్తి అయ్యే అవకాశం ఉందని అధికారులు అన్నారు. ఈ అండర్ పాస్ నిర్మాణం పూర్తయితే 61వ నంబర్ గేటు మూసివేయటంతో ప్రజల రాకపోకలకు ఎటువంటి అంతరాయం ఉండదు. దీని నిర్మాణం పూర్తయితే రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుందని, రైల్వే గేటు సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అండర్ పాస్‌లో నీరు నిల్వ ఉండకుండా...

అండర్ పాస్ నిర్మించిన తర్వాత వర్షపు నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక ఇంజనీరింగ్ ప్లాన్‌తో నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక కాలువలను నిర్మించుతున్నట్లు... అందుకు అనుగుణంగా నిర్మాణ పనులు జరుగుతున్నట్లు అధికారులు తెలియజేశారు.

విత్తనాలు అధిక ధరలకు అమ్మితే చర్యలు



పిడుగురాళ్ల విత్తన దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏవో ఎన్.శ్రీనివాస్‌రెడ్డి

పిడుగురాళ్ల: విత్తన దుకాణ యజమానులు రైతులకు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే దుకాణ యజమానులపై చర్యలు తప్పవని పిడుగురాళ్ల ఏవో ఎస్.శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని విత్తన దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎవరైనా సరే ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువకు విత్తనాలను అమ్మితే అటువంటివారిపై చర్యలు చేపడతామన్నారు. అలాగే అనుమతి లేని, నాసిరకం విత్తనాలను అమ్మిన యెడల చట్టపరంగా చర్యలు తీసుకుని లైసెన్స్ రద్దు చేయటమే కాకుండా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయటం జరుగుతుందని తెలిపారు. విత్తన దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. అనంతరం విత్తన దుకాణాలను తనిఖీ చేసి, స్టాక్ రికార్డులు, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. విత్తన నమూనాలను సేకరించి సీడ్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపించటం జరిగిందని ఈ సందర్భంగా ఏవో తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం



మాట్లాడుతున్న ఏఈఈ షేక్ మస్తాన్‌వలి

రెంటచింతల: మాచర్ల మండలంలోని తాళ్లపల్లి 220 కేవీ వీటీపీఎస్ సీకేటీ-1 నుంచి రెంటచింతల 220 కేవీ వీటీపీఎస్ సీకేటీ-1 లైన్లు షట్‌డౌన్ తీసుకోవడం వలన మండలంలోని వివిధ గ్రామాలలో ఈ నెల 28 నుంచి 30 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని.. విద్యుత్ వినియోగదారులందరూ విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని ఏపీ ట్రాన్స్‌కో ఏఈఈ షేక్ మస్తాన్‌వలి కోరారు. మంగళవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ ట్రాన్స్‌కో ఈఈ జె.హరిబాబు సూచనల మేరకు మాచర్ల మండలంలోని తాళ్లపల్లి 220 కేవీ వీటీపీఎస్ సీకేటీ-1 నుంచి రెంటచింతల 220 కేవీ సబ్‌స్టేషన్ వరకు నిర్మించిన నూతన లైన్‌ను ఈ నెల 30న ప్రారంభించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా మూడు రోజుల పాటు షట్‌డౌన్ తీసుకున్న సమయంలో 220 కేవీ రెంటచింతల సబ్ స్టేషన్‌కు 220 కేవీ తాళ్లపల్లి నుంచి విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ఒకవేళ ఏదైనా కారణం వలన ఈ ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే ఆయా గ్రామాల ప్రజలు స్థానిక విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

వైరస్‌లను తట్టుకునే విత్తనాలతో సాగు చేసుకోవాలి

ఏవో బ్రహ్మారెడ్డి

రెంటచింతల: పత్తి, మిరప పంటలను సాగుచేసే రైతులు పలు రకాల వైరస్ తెగుళ్లను తట్టుకునే విత్తనాలతో పంటలను సాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి, మిరప పంటల సాగులో తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పత్తి పంటకు ఇటీవల కాలంలో ఎక్కువగా గులాబిరంగు పురుగు నష్టం కలిగిస్తుందన్నారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మాత్రమే గులాబిరంగు పురుగు నివారణకు పిచికారీ మందులను వాడుకోవాలన్నారు. ఇటీవల కాలంలో మిరప పంటకు సుమారు 82 రకాల వైరస్‌లు ఆశించి నష్ట పరుస్తాయని మూడేళ్లుగా పలు జిల్లాల్లో మిరప పంటకు తెగుళ్ల ఆశించడం వలన రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. మన రాష్ట్రంలో ఎక్కువగా ఆకు ముడత, కుకుంబర్ మొజాయిక్ వైరస్, మొవ్వ కుళ్లు వైరస్‌లు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ముందుగా ప్రతి రైతు తాను సాగుచేసే పంట పొలంలో భూపరీక్షలు చేయించుకోవాలని, పంట మార్పిడి విధానాన్ని అనుసరించి, సేంద్రియ ఎరువులను వాడి సమతుల్య ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలను కొనుగోలు చేసి పంటలను సాగు చేసుకోవడం మంచిదన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించితే తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులను సాధించవచ్చని పేర్కొన్నారు.

అనాథ ఆశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేత



పిడుగురాళ్ల: రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ వారి ఆధ్వర్యంలో మంగళవారం కొండమోడులోని దీనమ్మ అండ్ రూరల్ సొసైటీ వీరమ్మ కాలనీ అనాథ ఆశ్రమానికి నిత్యావసర సరుకులను అందజేశారు. రోటరీ క్లబ్ సభ్యులు కొత్త రాధ, సంపూర్ణ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆశ్రమ నిర్వాహకుడు శంకర్‌కు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు ఆత్మకూరి గురవయ్య, సెక్రటరీ కొత్త రవికుమార్, డాక్టర్ విష్ణుబాబు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

33 మద్యం సీసాలు స్వాధీనం



దాచేపల్లి: అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సురేంద్రబాబు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంగళవారం రాత్రి పొందుగల చెక్ పోస్టు వద్ద ఎస్సై జి.సంధ్యారాణి వాహనాల తనిఖీలు చేపట్టారు. మిరియాలగూడ నుంచి దాచేపల్లి వైపు వస్తున్న పల్లె వెలుగు బస్సును తనిఖీ చేయగా అచ్చంపేట మండలం చెరుకుపాలెం గ్రామానికి చెందిన మైలు రవికుమార్ వద్ద రూ.22,770 విలువ చేసే 33 మద్యం సీసాలు గుర్తించారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న రవికుమార్‌ను అరెస్టు చేసినట్లు సీఐ సురేంద్రబాబు వెల్లడించారు. సమావేశంలో ఎస్సై దాసరి శివనాగరాజు ఉన్నారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

సత్తెనపల్లి టౌన్ సీఐ పోలూరి శ్రీనివాసరావు



కార్డన్ సెర్చ్‌లో సీఐ శ్రీనివాసరావు, సెబ్ సీఐ విజయ్ కుమార్, ఎస్ఐలు సంధ్యారాణి, సత్యనారాయణ

సత్తెనపల్లి: శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు పట్టణంలోని ముస్లింపాలెంలో మంగళవారం పట్టణ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపును సక్రమంగా నిర్వహించడమే పోలీసుల ముందున్న లక్ష్యమన్నారు. జూన్ 4న కౌంటింగ్ రోజు పట్టణ ప్రజలు క్రమశిక్షణతో పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రశాంతమైన వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగాలని, శాంతిభద్రతలకు ఎవరు ఆటంకం కలిగించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. లెక్కింపు రోజున ఎలాంటి పరిస్థితులు, సవాళ్లు ఎదురైనా వాటిని అధిగమించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సందర్భంగా ఇంటింటి తనిఖీ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలను పరిశీలన నిమిత్తం పోలీ స్టేషన్‌కు తరలించారు. పాత నేరస్తులు, అనుమానితులు, స్థానికేతర్ల కదలికలపై ఆరా తీశారు. కార్యక్రమంలో గుంటూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో గుంటూరు సీఐ పి.విజయకుమార్, పట్టణ ఎస్ఐలు ఎం.సంధ్యారాణి, ఎం.సత్యనారాయణ, పోలీసులు, మహిళా పోలీసులు తదితరులు ఉన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 670 మంది గైర్హాజర్

సత్తెనపల్లి: పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలకు సత్తెనపల్లి విద్యా డివిజన్ పరిధిలోని 14 మండలాల్లో మంగళవారం 670 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. టెన్త్ గణితం పరీక్షకు 1,769 మంది విద్యార్థులు హాజరు కావా ల్సి ఉండగా 1,099 మంది హాజరయ్యారు. 670 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

రాజుపాలెం: మండల కేంద్రంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పదవ తరగతి సప్లిమెంటరీ లెక్కల పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 181 మంది హాజరు కావాల్సి ఉండగా 105 మంది హాజరయ్యారు. 76 మంది గైర్హాజరైనట్లు డిపార్ట్‌మెంట్ అధికారి మల్లిఖార్జునరెడ్డి తెలిపారు.

నెలకు 10 కాన్పులు అయ్యేలా చూడాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

రాజుపాలెం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో రికార్డులు, రిపోర్ట్స్ హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టంను ప్రతి నెల పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. కాన్పుల గదిని పరిశీలించారు. ప్రతి నెల తప్పనిసరిగా పది కాన్పులు జరిగేటట్లు చూడాలని డాక్టర్ కృష్ణకుమార్‌కు సూచించారు. రాబోయే మూడు నెలల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి మురళి, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, స్టాఫ్ నర్సు చందన పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఆటల దినోత్సవం

బెల్లంకొండ: అంతర్జాతీయ ఆటల దినోత్సవ వేడుకలను బెల్లంకొండలోని బేడా బుడగ జంగాల కాలనీలో గ్రేస్ మహిళా మండలి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. గ్రేస్ మహిళా మండలి అధ్యక్షురాలు డి.కీర్తన మాట్లాడుతూ ఆటలు ఆడటం వలన మనోవికాసం, శారీరక దృఢత్వానికి మేలు కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ లీడర్ ఊర సింహాద్రి, ఊర జకరయ్య, పాస్టర్ డి.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో పోలీసుల తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

మాచర్ల రూరల్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తరువాత గ్రామాలలో ఏర్పడ్డ ఘర్షణ వాతావరణాన్ని నివారించేందుకు పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మండలంలోని కంభంపాడు, రాయవరం గ్రామాలలో ఎస్ఐ కె.రాజశేఖర్ నేతృత్వంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కౌంటింగ్ తరువాత ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా గ్రామస్తులు ఐకమత్యంగా ఉండి సోదర భావంతో మెలగాలని ఎవరైనా ఘర్షణలకు పాల్పడి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముందస్తు చర్యలలో భాగంగా గ్రామాలలో ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా ఓటర్లదే అంతిమ తీర్పు



పోలింగ్ బూత్‌లో బారులో తీరిన ఓటర్లు (ఫైల్)

గురజాల : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసి 14 రోజులు కావస్తుంది. కానీ నేటికి కూడా పల్నాడు ప్రాంతంలోని గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో వేడి మాత్రం తగ్గలేదు. ఎన్నికల ఫలితాలపై రోజు రోజుకూ ఉత్కంఠ పెరుగుతుంది. ఓట్ల లెక్కింపు జూన్ 4వ తేదీ జరగనుంది. ఎవరి భవితవ్యం ఎలా ఉండబోతుందోనన్న ఆలోచనలో ప్రతి ఒక్కరూ ఉన్నారు. ప్రజల తీర్పు ఈవీఎంల్లో భద్రంగా ఉంది. తీర్పు అంతిమంగా మహిళల ఓట్లపైనే ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. 2019 ఎన్నికల కంటే 2024 ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరగడంతో ఎవరికి వారు తమకు అనుకూలంగా ఫలితాలు వస్తాయని అంచనాలు వేసుకుంటున్నారు.

మహిళలు ఎటు వైపు...

గురజాల నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో ఎవరు గెలుస్తారంటూ బంధువులు, స్నేహితులకు ఫోన్లు చేస్తూ ఆరా తీస్తున్నారు. ఈ సారి ఎన్నికల పోలింగ్‌లో యువకులు, మహిళలు, వలస ఓటర్లు అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్న నేపథ్యంలో వీరు ఎవరి వైపు అనే చర్చ ప్రధానంగా నడుస్తోంది.

పెరిగిన పోలింగ్

గురజాల నియోజకవర్గంలో 2,73,971 మంది ఓటర్లుకు గాను 1,33,353 మంది పురుషులు1,40,576 మంది మహిళలు, 42 మంది ఇతరులు ఉన్నారు. ఈ నెల 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో 2,30,945 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 1,12,704 మంది కాగా మహిళలు 1,18,219 మంది ఇతరులు 22 మంది పోలింగ్‌లో పాల్గొన్నారు. 84.30 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. 2019 ఎన్నికల్లో 2,68,469 మంది ఓటర్లుకు గాను 2,24,218 ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొన్నారు. 83.52 శాతం పోలింగ్ నమోదు జరిగింది. పెరిగిన పోలింగ్ శాతం ఎవరికి అనుకూలంగా ఉంది తెలియాలంటే జూన్ 4వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



పశర్లపాడులో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య పర్యవేక్షకులు అంకమ్మరావు

రెంటచింతల: సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మరావు అన్నారు. మంగళవారం రెంటచింతల పీహెచ్‌సీ పరిధిలోని పశర్లపాడు గ్రామ కాలనీలలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఇళ్లలో ఉన్న పాతటైర్లు, కొబ్బరి బొండాలను వెంటనే తొలగించాలని, కూలర్‌లలోని నీటిని వారానికి ఒకసారి కచ్చితంగా మార్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల ముందున్న సైడ్‌కాలువలలో వారానికి ఒక్కసారి కిరోసిన్ లేదా బ్లీచింగ్ చల్లుకోవాలని, దీంతో ఈగలు, దోమలు నశిస్తాయని తెలిపారు. దోమ తెరలను వాడుకోవాలని సూచించారు. దోమలను పారదోలితే డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, మెదడువాపు, బోద వంటి వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చన్నారు. వరుసగా రెండు, మూడు రోజుల పాటు జ్వరం వస్తే వెంటనే పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాషా, హెల్త్ అసిస్టెంట్ మహేష్ బాబు, ఏఎన్ఎం శిరీషా, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కొమ్ము ముక్కంటికి కన్నీటి వీడ్కోలు



మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి భౌతిక కాయాన్ని కర్మభూమికి తీసుకువెళ్తున్న దృశ్యం

పిడుగురాళ్ల: మంచితనానికి మారు పేరు, చిన్న పెద్ద తేడా లేకుండా అందరినీ చిరునవ్వుతో పలకరించే వ్యక్తి.. ఓ పక్క పాస్టర్‌గా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ప్రజలకు సేవలు అందిస్తూ ప్రజల్లో తనకంటూ ఒక మంచి స్థానాన్ని సంపాదించుకున్న కొమ్ము ముక్కంటి అకాల మరణంతో పిడుగురాళ్లలో విషాద ఛాయలు అలముకున్నాయి. అప్పటి వరకు కుటుంబ సభ్యులతో సరదాగా గడిపిన కొమ్ము ముక్కంటికి సోమవారం ఒక్కసారిగా గుండె నొప్పి రావడంతో గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అక్కడ గుండెపోటు కారణంగా ముక్కంటి (61) మరణించారు. మంచితనానికి మారుపేరు పేరు అయిన మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి అకాల మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీరని దుఃఖంలో మునిగిపోయారు. మంగళవారం ముక్కంటి భౌతిక కాయానికి అంత్యక్రియలు నిర్వహించారు. గురజాల నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఆయనకు భార్య మరియమ్మతోపాటు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

రుతుక్రమంపై మహిళలకు అవగాహన



అంగన్‌వాడీ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీవో శ్రీవల్లి

పిడుగురాళ్ల రూరల్: ప్రతి మహిళ రుతుక్రమ సమయంలో వ్యక్తి గత శుభ్రత పాటిస్తే అనారోగ్య సమస్యలు దరిచేరవని పిడుగురాళ్ల సీడీపీవో శ్రీవల్లి తెలిపారు. మహిళలకు రుతుక్రమంపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు రుతుక్రమ సమయంలో పాటించాల్సిన శుభ్రత, శారీరక, మానసిక పరిస్థితుల సమన్వయం, కిశోర బాలికలలో శారీరక మార్పులు, తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మూఢ ఆచారాలు, మూఢ నమ్మకాలు అలాగే స్త్రీల ఆరోగ్య పరిరక్షణ గురించి మహిళలకు పూర్తిస్థాయిలో వివరించారు. పురుషులు సైతం రుతుక్రమ సమయంలో వారికి సహకరించి వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపవర్‌వైజర్లు ప్రసన్నకుమారి, నాగమణి, ఎం.సువర్ణ, ప్రసన్న, వెంకట లక్ష్మి, అంజలి, అన్నపూర్ణ, కోటేశ్వరి, సంపత్‌కుమార్, అనూష, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు శుభ్రమైన భోజనం అందించాలి

ఎంఈవో నరసింహారావు



వంట ఏజెన్సీల వారితో మాట్లాడుతున్న ఎంఈవో నరసింహారావు

అచ్చంపేట: విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేయాలని ఎంఈవో నరసింహారావు మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు సూచించారు. స్థానిక జెడ్పీ హైస్కూలులో మంగళవారం వంట ఏజెన్సీలకు, ఆయాలకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులంతా నూరుశాతం మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే తినే విధంగా భోజనం వండాలన్నారు. ప్రతి రోజు తప్పనిసరిగా మెనూ పాటించాలన్నారు. పాఠశాలలోనే భోజనం తయారు చేయాలని, బయట వండుకొని తేవడం వంటి పద్ధతులకు స్వస్తి పలకాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మధ్యాహ్న భోజనంలో తీసుకువచ్చిన మార్పులను కచ్చితంగా పాటించాలన్నారు. ఇందుకు విరుద్ధంగా ప్రవర్తించినవారిపై చర్యలు తప్పవన్నారు. వంటశాల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన అలివేలమ్మ, ఎంపీపీఎస్, పెదపాలెం ఆర్ అండ్ సెంటర్, బి.పద్మ, జెడ్పీహెచ్ఎస్, అచ్చంపేట, జార్జమ్మ, ఎంపీపీఎస్, కోగంటివారిపాలెంకు ప్రోత్సాహక బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ ఆళ్లమూడి వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీలు పాల్గొన్నారు.